## క్లుప్తంగా

### అర్బన్ సీఐ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ డి.రాము

**ఆత్మకూరు రూరల్:** ఆత్మకూరు అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐగా డి రాము బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు డీఎస్పీ రామాంజి నాయక్‌ను సీఐ మర్యాద పూర్వకంగా కలిశారు.

### ప్రజలపై విద్యుత్ చార్జీల భారం

**పాములపాడు:** కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీలు భారం మోపుతోందని, ఈ అంశంపై ప్రజల్లో చర్చ జరగాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రామేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి విద్యుత్ చార్జీలపై నోరు మెదపని పాలకులను విమర్శిస్తూ పాలకుల మూగనోము పత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరుతో సుమారు రూ.9వేల కోట్ల భారం ప్రజలపై పడుతుందన్నారు. నాడు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించి ఇప్పుడు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సంఘాల నాయకులు వెంకటేశ్వరరావు, స్వామన్న, రాజు, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.

### సాక్షి గణపతికి పూజలు


సాక్షిగణపతి

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధ జలంతో అభిషేకం చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేపట్టారు. జ్వాలా వీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

### మోతాదుకు మించి మందులు పిచికారీ చేయొద్దు

**పాములపాడు:** తెగుళ్ల నివారణలో భాగంగా పంటలకు మోతాదుకు మించి రసాయన మందులు పిచికారీ చేయరాదని జిల్లా వనరుల కేంద్రం ఏఓ హేమలత, ఏఓ ఫణీశ్వరరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని వేంపెంట, గుండాలనట్టు తండా, చెలిమిల్ల, లింగాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సాగైన పైర్లను పరిశీలించారు. మొక్కజొన్నలో ఆకు ఎండు తెగులు, కందిలో ఎండు తెగులు, మినుములో పల్లాకు తెగులు, వేరుకుళ్లు తెగులు గమనించినట్లు చెప్పారు. వాటి నివారణ చర్యలను రైతులకు వివరించారు. ఏఈఓ మద్దిలేటి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### రూ.లక్ష విరాళం

**మిడుతూరు:** నందికొట్కూరు పట్టణంలో సీపీఎం కార్యాలయ నూతన భవన నిర్మాణానికి కామ్రేడ్ ఎస్. రామచంద్రయ్య జ్ఞాపకార్థం ఆయన మనుమలు బుధవారం చెరుకుచెర్ల గ్రామంలో రఘురామయ్య స్వగృహంలో రూ.లక్ష విరాళం అందజేశారు. సీపీఎం నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ రామచంద్రయ్య నందికొట్కూరు, ఆత్మకూరు ఉమ్మడి నియోజకవర్గంలో అనేక రైతాంగ పోరాటాలు, కార్మికుల, కష్టజీవుల సంక్షేమం కోసం, దళితులపై దాడులు, వివక్షత, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేశారని కొనియాడారు. గోపాలకృష్ణ, మద్దిలేటి, రామకృష్ణ, లింగస్వామి, ఓబులేసు పాల్గొన్నారు.

### బోధన కుంటుపడుతోంది

**ఆత్మకూరు:** గిరిజన గురుకుల పాఠశాలల అవుట్ సోర్సింగ్ టీచర్లు సమ్మె బాట పట్టడంతో బోధన కుంటుపడుతోందని గిరిజన ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు జవహర్‌నాయక్ అన్నారు. బుధవారం బైర్లూటీ చెంచుగూడెంలోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. అక్కడి విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ టీచర్లు కొన్ని రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. మార్చి 15 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్న నేపథ్యంలో టీచర్ల సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు బోధన అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

### పాడిపశువుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

**మహానంది:** పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పశువైద్యాధికారి కరుణాకర్, డాక్టర్ శివానంద్, డాక్టర్ గౌతమి సూచించారు. మహానంది వ్యవసాయ కళాశాలలోని జాతీయ సేవా పథకం కార్యక్రమంలో భాగంగా ఐదవ రోజు అల్లినగరం గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పాఠశాల పక్కన ఉన్న గదికి రంగులు వేసి అందంగా ముస్తాబు చేశారు. పశు వైద్యులు మాట్లాడుతూ పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు వహించాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ మాధవి, డాక్టర్ ఫరీదా, డాక్టర్ పి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

# వారు మారరు.. వాటిని వాడరు!

- నిరుపయోగంగా జనరేటర్, ఇన్వర్టర్
- మూలకు చేరిన ఫైరు సిలిండర్లు
- పట్టించుకోని వైద్యాధికారులు

**జూపాడుబంగ్లా:** ప్రభుత్వ ఆసుపత్రి అనగానే 24 గంటల పాటు విద్యుత్ సౌకర్యం ఉండాలి. ఓ గంట విద్యుత్ సరఫరా నిలిచిపోయినా ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన వ్యాక్సిన్లు కూల్ తగ్గి నిరుపయోగంగా మారే అవకాశం ఉంటుంది. అలాగే చికిత్సల సమయంలో సేవలు నిలిచిపోవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జనరేటర్, ఇన్వర్టర్‌లను అందజేసింది. అయితే స్థానిక పీహెచ్‌సీలో ఇన్వర్టర్లను అమర్చకుండా ఓ గదిలో మూలనపడేశారు. అలాగే అత్యవసర సమయంలో వినియోగించుకోవాల్సిన జనరేటర్‌ను కూడా ఓ మూలన ఉంచారు. ఇక ఏదేని మంటలు చెలరేగినా, అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నా రక్షించేందుకు, మంటలను అదుపు చేసేందుకు ఫైర్ సిలిండర్లను కూడా మంజూరే చేసింది. వాటిని కూడా వైద్యాధికారులు పక్కన పడేశారు. ఆసుపత్రిలోని అత్యవసర సేవలు, అవసరమైన చోట వాటిని అమర్చాల్సి ఉండగా.. ఆ దిశగా చర్యలు చేపట్టకుండా మూలకు పడేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి అందజేస్తే అధికారుల నిర్లక్ష్యం కారణంగా వినియోగానికి నోచుకోకుండా పోతున్నాయి. ఈ విషయమై డాక్టర్ గంగాధర్‌ను వివరణ కోరగా.. ఇన్వర్టర్, జనరేటర్లనుఅమర్చాలని కాంట్రాక్టర్లకు సూచించినా పట్టించుకోవటం లేదని తెలిపారు.


పీహెచ్‌సీలో వినియోగానికి నోచుకోని జనరేటర్


ఓ గదిలో ఉంచిన ఇన్వర్టర్, ఫైర్ సిలిండర్లు

### 6 నుంచి గ్రామ రెవెన్యూ సదస్సులు

**శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలం మండలంలో ఈనెల 6 నుంచి 31వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6న శిఖరేశ్వరంలోని చెంచు గూడెం, 13న హఠకేశ్వరం గూడెంలోని కమ్యూనిటీ సెంటర్, 20న శ్రీశైలం గ్రామసచివాలయం-4, 27న సున్నిపెంట గ్రామసచివాలయం-2, లింగాలగట్టు ఎంపీపీ పాఠశాలలో లో 31న సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు

- **ఆత్మకూరు:** ఈనెల 6 నుంచి మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రత్నరాధిక బుధవారం తెలిపారు. 6న ఇందిరేశ్వరం, 10న కురుకుంద, 13న ఆత్మకూరు, 17న వడ్ల రామాపురం, 18న కరివేన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు చేపడతామన్నారు. భూ సమస్యలు, రెవెన్యూ పరమైన సమస్యలు ఉన్న రైతులు అర్జీల రూపంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

### ఇన్సూరెన్స్ చేయించుకోవాలి


మాట్లాడుతున్న ఏడీఏ ఆంజనేయ

**ఆత్మకూరు:** ఈనెల 15వ తేదీలోగా తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఏడీఏ ఆంజనేయ, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, పట్టు పరిశ్రమశాఖ అధికారి అరుణ సూచించారు. మండలంలోని సిద్ధాపురం, కృష్ణాపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్యాంకులో రుణాలు తీసుకున్న రైతులు, కౌలు రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తమ గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో పంటల నమోదు చేయించుకోవాలని సూచించారు. గ్రామీణ విత్తనోత్పత్తి కార్యక్రమంలో భాగంగా వరి పంటలో యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. రైతులు రసాయనిక, పురుగు మందుల వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు.

## అంత్యక్రియలకు వాహనం ఏర్పాటు

**శ్రీశైలంటెంపుల్:** శ్రీశైలం వాసులెవరైనా మృతిచెందితే శ్మశానవాటికకు మృతదేహాన్ని తరలించేందుకు ప్రత్యేకంగా కైలాస వాహనాన్ని ఏర్పాటు చేయాలని దేవస్థాన ఈఓ ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గౌరవ ప్రదమైన రీతిలో అంతిమ సంస్కారాలను జరిపేందుకు వీలుగా ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. శవదహనానికి దేవస్థానం డంపింగ్ యార్డ్ సమీపంలో 50 సెంట్ల స్థలంలో చుట్టూ ఏడు అడుగుల ఎత్తులో శ్మశానవాటిక ఏర్పాటు చేయాలన్నారు. దహనానికి గ్యాస్ క్రిమోటోరియాన్ని, చితాభస్మాన్ని భద్రపరిచేందుకు షెడ్డు, అక్కడే స్నానాల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయడంతోపాటు కాటికాపరిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం దేవస్థానం చేస్తున్న అనాథప్రేత సంస్కరణలు కూడా పోలీసు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా జరిపి, పురోహితుడిని ఏర్పాటు చేసి మంత్రపూర్వకంగా దేవస్థానం నిధులతో దహన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఎవరైనా పేద యాత్రికులు శ్రీశైలక్షేత్ర పరిధిలో మరణించినట్లయితే మృతదేహాన్ని బంధువుల సూచనల మేరకు వారి స్వస్థలాలకు దేవస్థానమే ఉచితంగా చేర్చాలని ఆదేశించారు. క్షేత్రాన్ని సందర్శించే భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఇకపై శ్రీశైలక్షేత్రంలో ఖననం చేయడం, సమాధి నిర్మించడం శాశ్వతంగా నిషేధించినట్లు చెప్పారు.

### విజయవంతం చేయండి

**పాములపాడు:** సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏసురత్నం కోరారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9,10 తేదీల్లో నంద్యాల జిల్లా కేంద్రంలో మహా సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నాయకులు స్వామన్న, రామేశ్వరరావు, వెంకటేశ్వరరావు, రాజు, శ్రీను పాల్గొన్నారు.

### నేడు ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం

**వెలుగోడు:** స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఏఓ పవన్ కుమార్ తెలిపారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి వ విజేతలకు బహుమతుల అందించనున్నామన్నారు. ప్రకతి వ్యవసాయ పద్ధతులు ద్వారా నేల ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తామన్నారు. రైతులు పాల్గొని ప్రపంచ నేల దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### వరికి గిట్టుబాటు ధర కల్పించాలి

**పగిడ్యాల:** వరి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి పక్కీర్‌సాహెబ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పడమర ప్రాతకోట గ్రామంలో కల్లాల్లో ఆరబోసిన వరి ధాన్యాన్ని సీపీఎం బృందం సందర్శించి గిట్టుబాటు ధరపై రైతులను ఆరా తీశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కేసీ ఆయకట్టు కింద, బావులు, బోర్ల వద్ద రైతులు సోనా మసూరి, నంద్యాల సోనా రకం వరి పంట సాగుకు ఎకరాకు సుమారు రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టారని, ప్రస్తుతం వరి కోతలు ప్రారంభమయ్యాయన్నారు. గతంలో వరి బస్తా(70కేజీలు) ధర రూ. 2,300కు విక్రయించిన రైతాంగం ఈ ఏడాది వ్యాపారులు రూ.1500కు కొనుగోలు చేయడం లేదని మండిపడ్డారు. ప్రస్తుత ధరకు విక్రయిస్తే పెట్టుబడి కూడా చేతికి రాక అప్పుల్లో కూరుకుపోతామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. నాయకులు బాబు, స్వాములు, రాముడు, రాజు, లక్ష్మీదేవి ఉన్నారు.

## మాస్టర్ ప్లాన్ రూపొందించండి

- దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్

**మహానంది:** మహానంది ఆలయానికి మాస్టర్‌ప్లాన్ రూపొందించాలని దేవదాయశాఖ అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. మహానందిలో ప్రసాదాల తయారీ విభాగంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. అధికారులతో మాట్లాడుతూ మహానంది ఆలయానికి సంబంధించి గతంలో రూపుదిద్దిన మాస్టర్‌ప్లాన్‌లో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే వెంటనే సరిచేసి ప్రతిపాదనలు పంపాలన్నారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, దేవదాయశాఖ ఎస్ఈ సతీష్, డీఈ శ్రీనివాసప్రసాద్, ఏఈఓ వై.మధు, సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులతో మాస్టర్‌ప్లాన్, అభివృద్ధి పనులపై చర్చించారు.


ఈఓ, ఎస్ఈ, డీఈలతో కలిసి మాస్టర్‌ప్లాన్ పరిశీలిస్తున్న ఏడీసీ రామచంద్రమోహన్

### మహానందిలో భక్తుల సందడి

**మహానంది:** మహానందీశ్వరుడి సన్నిధిలో బుధవా రం భక్తుల సందడి కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు ఆలయానికి చేరు కుని కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం యాగశాలలో గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు నిత్య కల్యాణోత్సవ పూజలు నిర్వహించారు. వేదపండితులు నాగేశ్వరశర్మ, ఆంజనేయశర్మ, హనుమంతు శర్మల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. రాత్రి స్వామి, అమ్మవారి దంపతులకు ఏకాంతసేవ పూజలు చేపట్టారు.


మహానందీశ్వరుడి దర్శనార్థం వస్తున్న భక్తులు

## ప్లాస్టిక్ నిషేధం అమలుపై నిర్లక్ష్యం

**బండిఆత్మకూరు:** ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు అంతులేని నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తునాయి. మార్కెట్‌లోనూ ప్లాస్టిక్ కవర్లు విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. దీనివల్ల పాలిథిన్ కవర్లు, వస్తువుల విక్రయాలు మండలంలో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గతంలో 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లు విక్రయించే వ్యాపారులపై అధికారులు దాడులు చేసి జరిమానాలు విధించంతో వాటి వినియోగం తగ్గింది. నేడు ఆ పరిస్థితి లేక మళ్లీ మొదటికి రావడంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ప్లాస్టిక్ కవర్లలో వేడివేడి పదార్థాలను పెట్టుకుని తింటుండటంతో పాలీస్టైరిన్ అనే క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు.


పాలిథిన్ వ్యర్థాలతో నిండిపోయిన దారి.

### గడువులోపు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

**పాములపాడు:** గోకులం షెడ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని మద్దూరు, క్రిష్టానగర్ గ్రామాల్లో నిర్మాణాల్లో ఉన్న గోకులం షెడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నాటికి నిర్మాణాలు పూర్తి చేసుకుంటే వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.1.80 లక్షలు బిల్లు వస్తుందని తెలిపారు. 5 ఎకరాల్లోపు పొలం ఉన్న వారు, పశువులు ఉన్న రైతులను గుర్తించి పశు వైద్యాధికారులు ఎంపిక చేసిన రైతులకు మాత్రమే గోకులం షెడ్లు మంజూరయ్యాయని చెప్పారు. ఏపీఓ విమలమ్మ, జేఈ నాయుడు, టీఏ తదితరులు ఉన్నారు.


షెడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

## బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు

**రుద్రవరం:** మండల పరిధిలోని ముత్తలూరు సమీపంలో మోటర్ సైకిల్ నుంచి కింద పడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ముత్తలూరు గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన ధనపాల్ అనే వ్యక్తి గత కొంతకాలంగా వరి కోత మిషన్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నర్సాపురం వద్ద ఉంటూ చుట్టుపక్కల గ్రామాల రైతుల పొలాల్లో వరి కోతలు చేపట్టేవాడు. ఈ క్రమంలో బుధవారం నర్సాపురం నుంచి ముత్తలూరులో ఉన్న యంత్రం వద్దకు మోటర్ సైకిల్‌పై వెళ్తుండగా అదుపుతప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

### డెయిరీ పాలకవర్గ సభ్యుల ఎన్నికకు నామినేషన్లు

**కొత్తపల్లి:** విజయ డెయిరీ పాలకవర్గ సభ్యుల ఎన్నికకు నామినేషన్ల ప్రక్రియ చేపట్టినట్లు విజయ డెయిరీ ఆత్మకూరు యూనిట్ మేనేజర్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో పాలకవర్గ సభ్యుల ఎన్నికకు నామినేషన్లు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రెండు స్థానాలకు సోమల రవీంద్రారెడ్డి, గంధం మహేశ్వర నామినేషన్ వేశారని, వాటిని నంద్యాల కార్యాలయానికి పంపించామని చెప్పారు. తదుపరి ఎన్నికలను ప్రధాన కార్యాలయ ఆదేశాలతో నిర్వహిస్తామని తెలిపారు.

## మంచినీరు కలుషితం


పైపు లీకేజీతో భారీగా నిలిచిపోయిన నీరు


కల్వర్టు వద్ద పైప్‌లైన్ లీకేజీతో నిలిచిన నీరు

**జూపాడుబంగ్లా:** మండల కేంద్రానికి సరఫరా అవుతున్న మంచినీరు కలుషితం అవుతుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని శివాలయం సమీపంలోని బోరు నుంచి ఎంపీడీఓ కార్యాలయం వద్దనున్న ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీరు సరఫరా అవుతాయి. అక్కడి నుంచి క్వార్టర్స్, పింజరిపేట, బీసీ కాలనీ, జంగాలపేట, తదితర కాలనీల్లోని సుమారు 850 కుటుంబాలకు తాగునీరు సరఫరా అవుతుంది. తంగడంచ ఫారంలోకి వెళ్లే బ్రిడ్జి, కల్వర్టుల వద్ద తాగునీటి పైపు లీకేజీ అయ్యింది. దీంతో నీరు కలుషితం అవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. మూడు రోజుల నుంచి కుళాయిల నుంచి నీరు ఎర్రగా వస్తున్నాయంటున్నారు. ప్రజలు రోగాలబారిన పడకముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు


మిడుతూరులో పొలం పిలుస్తుంది నిర్వహిస్తున్న ఏడీఏ విజయశేఖర్


గోవకరం వద్ద కందిపైరును పరిశీలిస్తున్న ఏఓ, బీమా జిల్లా అధికారి సునీల్

**మిడుతూరు:** సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్ అన్నారు. బుధవారం మండలకేంద్రం సమీప పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల, సైంటిస్టుల సలహాలు పాటించడంతోపాటు వాతావరణంలోని మార్పులకు అనుగుణంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి .. సేంద్రియ పద్ధతిలో పంటలు సాగు చేయాలన్నారు. పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. అనంతరం అడ్వాంటా సీడ్ మొక్కజొన్న, కంది పంటల్లో చీడపీడల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఏఓ పీరునాయక్, రైతులు పాల్గొన్నారు.

**జూపాడుబంగ్లా:** వాతావరణ పరిస్థితులు మారినందున కంది, మినుము, శనగ పంటల్లో పురుగు, తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉందని, సత్వరమే తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ కృష్ణారెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని తరిగోపుల గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మినుము, కంది, శనగలో పురుగు ఉధృతమయ్యే అవకాశం ఉందన్నారు. మినుములో పల్లాకు తెగులు, కంది, శనగ పంటల్లో ఎండు తెగులు వ్యాపిస్తుందని జింక్,బోరాన్,మెగ్నీషియం, కార్బన్‌డిజం పిచికారీ చేసుకోవాలన్నారు.

**మొక్కుబడిగా కార్యక్రమం..**

వ్యవసాయ, ఉద్యానవన, హార్టికల్చర్, మార్కెట్ యార్డు, పశుసంవర్ధకశాఖ, తదితర శాఖల అధికారుల సమక్షంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాల్సి ఉంది. అయితే కేవలం వ్యవసాయశాఖ అధికారులు మాత్రమే మొక్కుబడిగా అప్పటికప్పుడు పది మంది రైతులను పోగుచేసి కార్యక్రమం నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారనే విమర్శలున్నాయి.

**నందికొట్కూరు:** మండలంలోని అల్లూరు, శాతనకోట పొలిమేరలో డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు విజయశేఖర్, షేక్షావలి పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించా రు. ఆయా గ్రామాల్లో రబీలో సాగు చేస్తున్న మొక్కజొన్న శనగ, మినుము పంటలను పరిశీలించారు. పంటలకు బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు.

**పంటల నమోదు తప్పనిసరి**

**కొత్తపల్లి:** రబీ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు పంటనమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని, అలాగే పంటల బీమా రైతులే చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ సునీల్ తెలిపారు. బుధవారం మండలంలోని గోకవరం, ఎదురుపాడు గ్రామాల పొలాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందిపంటలో వేరుకుళ్లు తెగులు నివారణకు ట్రైకోడెర్మా విరిడిని మొక్కల మొదలు తడిచేటట్లు పిచికారీ చేసుకోవాలన్నారు. కందిలో సస్యరక్షణ, తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు వివరించారు.

### సులభశైలిలో బోధన సాగాలి

**మిడుతూరు:** విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధన సాగాలని ఎంఈఓ -2 శ్రీనాథ్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాల (మెయిన్) రెండో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయుడు గోవిందరెడ్డి, ఉన్నారు.

### ప్రాచీన కళలను పరిరక్షించుకోవాలి

**మహానంది:** కనుమరగవుతున్న ప్రాచీన కళలను పరిరక్షించుకోవాలని తిరుపతి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీ విజయశంకర స్వామి తెలిపారు. బుధవారం ఆయన మహానందీశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం కళాకారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహానందిలో ఏడాది పొడవునా భజనలు, సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరగాలని, అందుకు దేవదాయశాఖ అధికారులు కళాకారులకు అవకాశం కల్పించాలన్నారు.

### ఉపాధి పనులు కల్పించాలి

**కొత్తపల్లి:** ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులకు పనులు కల్పించాలని ఏపీఓ హరికృష్ణ సూచించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంటలు పూర్తవడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు తక్కువయ్యాయని, వెంటనే అడిగిన వారందరికీ పనులు చూపాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రెండు సంవత్సరాలకు ఉపయోగపడేలా కొత్త పనులను గుర్తించాలని చెప్పారు. జాబుకార్డు కలిగిన వారు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్లకు డిమాండ్ పత్రాలు ఇవ్వాలని తెలిపారు.

### సర్వేలు త్వరగా పూర్తి చేయాలి

**పాములపాడు:** ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు సర్వేలను పూర్తి చేయాలని, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని మద్దూరు, వానాల, మిట్టకందాల గ్రామాల సచివాలయాలను తనిఖీ చేశారు. అంతకు ముందు గ్రామాల్లో సిబ్బంది నిర్వహిస్తున్న సర్వేలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్, ఎంఎస్ఎంఈ సర్వేలు వేగవంతం చేయాలని చెప్పారు. అనంతరం సచివాయాలల్లో సిబ్బంది అటెండెన్స్ రిజిష్టర్‌లను పరిశీలించారు.

## రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కరించుకోండి


మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్

**జూపాడుబంగ్లా:** ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభయ్యే రెవెన్యూ సదస్సుల్లో గ్రామాల్లోని రైతులు భూ సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవచ్చునని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ అనంతరం వివిధ గ్రామాల వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు, ప్రజలు వారి భూ సమస్యలుంటే వాటికి సంబంధించిన ఆధారాలతో దరఖాస్తులు అందజేస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. పెద్ద పెద్ద భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. వీఆర్వోలు మ్యానువల్ అడంగల్ రికార్డులు, ఆర్ఓఆర్, ఆర్ఎస్ఆర్, రెవెన్యూ మ్యాప్‌లు తదితర రికార్డులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.ఈనెల 6న మండ్లెం, 10న పారుమంచాల, 13న తాటిపాడు, 17 80బన్నూరు, 20 తూడిచెర్ల, 27 తర్తూరు, 31 తంగడంచ, 2025 జనవరి 2తేదీన పోతులపాడు, 4న తరిగోపుల, 8న పి.లింగాపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని వివరించారు.